ప్రజాశక్తి
గురువారం 14 నవంబర్ 2024 | 5 | విజయనగరం

గ్రోత్ సెంటర్‌లో స్థానికులకు ఉపాధి కల్పించాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే బేబినాయన

ప్రజాశక్తి- బొబ్బిలి

గ్రోత్ సెంటర్‌లో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎమ్మెల్యే బేబి నాయన కోరారు. అసెంబ్లీ సమావేశాలలో గ్రోత్ సెంటర్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రోత్ సెంటర్లో పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రైతులు నుంచి తక్కువ ధరకు భూములు తీసుకున్నప్పటికి పూర్తి స్థాయిలో పరిశ్రమలు ఏర్పాటు చేయలేదన్నారు. . పరిశ్రమలు ఏర్పాటు చేయని భూములను వెనక్కి తీసుకుని నూతన పరిశ్రమలకు భూములు కేటాయించాలని కోరారు. ఇప్పటికే వున్న ఫెర్రో పరిశ్రమలలో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వకుండా ఒడిషా, బీహార్ రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకుని వచ్చి తక్కువ వేతనాలు ఇచ్చి పనులు చేపిస్తున్నారని చెప్పారు. ఫెర్రో పరిశ్రమలలో స్థానికులకు ఉద్యోగాలు ఇచ్చి కనీస వేతనాలు ఇవ్వాలని కోరారు.

ఉద్యమాల వారధి... శ్రమజీవుల సారథి

- ప్రజా సంఘాలకు అండగా సిపిఎం
- ఎర్రజెండా అండతో గళం విప్పిన ఉద్యోగ, కార్మిక, కర్షక సంఘాలు
- కష్టజీవుల పోరాటాల్లో నిర్బంధాలు, కేసులు ఎదుర్కొన్న సిపిఎం నాయకులు

సిఐటియు ఆధ్వర్యాన జరిగిన కార్మికుల ర్యాలీలో పాల్గొన్న సిపిఎం నాయకులు (ఫైల్)

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

శ్రమ జీవులు ఉన్న ప్రతి చోటా ఎర్రజెండా ఏదో ఒక సందర్భంలో ఎగురుతునే ఉంటుంది. ఆ పోరుదారిలో ఉద్యమ వారధిగా నిలుస్తోంది. జిల్లాలో కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు వంటి పేద, మధ్య తరగతి ప్రజానీకానికి చేసే భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ (సిపిఎం) నిరంతరం అండగా నిలుస్తోంది. ప్రజలకు అన్యాయం జరిగిన ప్రతిసారి గొంతెత్తి గళం వినిపించడం మాత్రమే కాదు. అభివృద్ధి, సంక్షేమాన్ని కాంక్షిస్తూ నిరంతరం పాలకుల బాధ్యతలను గుర్తుచేస్తుంది. ముఖ్యంగా శ్రమ జీవుల హక్కుల రక్షణ, సాధన కోసం నిరంతరం పరితపించే పార్టీల్లో మార్క్సిస్టు పార్టీ అగ్ర భాగాన ఉంటుందనడంలో సందేహం లేదు. ఈ తరుణంలో ఈనెల 16, 17వ తేదీల్లో సిపిఎం విజయనగరం జిల్లా 10వ మహాసభలు నిర్వహించుకునేందుకు సన్నద్ధమౌతోంది. ఈనేపథ్యంలో వివిధ రంగాలకు చెందిన కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, స్కీంవర్కర్లు, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల కోసం సిపిఎం చేసిన పోరాటాలు, సాధించుకున్న విజయాలు, నిర్బంధాలు, అక్రమ కేసులు, జైలు జీవితాలను గుర్తుచేసేదే ఈ ప్రత్యేక కథనం.

ఉమ్మడి విజయనగరం జిల్లాలో కొన్ని దశాబ్దాల క్రితం అటు కురుపాం, గుమ్మలక్ష్మీపురం, ఇటు కొత్తవలస కేంద్రాలుగా ఆవిర్భవించిన సిపిఎం అనతికాలంలోనే జిల్లా వ్యాప్తంగా విస్తరించింది. గిరిజనుల హక్కుల కోసం, పెంకుల మిల్లులు, జ్యూట్ మిల్లులు, గరివిడి ఫేకర్‌లోని కార్మికుల శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా ప్రారంభమైన పార్టీ ఉద్యమాలు 1995వ దశకం నాటికి ఊపందుకున్నాయి. రైతాంగానికి తలమానికంగావున్న తోటపల్లి ప్రాజెక్టు చేపట్టాలని పెద్దఎత్తున పోరాడింది సిపిఎం నాయకత్వంలోనే. తోటపల్లి, రామతీర్థసాగర్, పెద్దగెడ్డ తదితర సాగునీటి ప్రాజెక్టుల వల్ల నిర్వాసితులుగా మారిన రైతుల కోసం పార్టీ ఆధ్వర్యాన ఉవ్వెత్తున ఉద్యమాలు సాగాయి. ఇటీవల పనులు ప్రారంభించిన భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్వాసితులకు సహా ఆయా ప్రాజెక్టుల నిర్వాసితులకు కూడా మెరుగైన నష్టపరిహారం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇప్పించడంలో కీలకపాత్ర పోషించింద నడంలో సందేహం లేదు. జిల్లా విభజనకు ముందే ప్రజా సమస్యలు, పార్టీ ఉద్యమ అవసరాల నిమిత్తం 2021లో పార్టీ విజయనగరం, పార్వతీపురం జిల్లా కమిటీలుగా వీడింది. నాటి నుంచి నేటి వరకు విజయనగరం జిల్లాలో ఎన్నో ప్రజాసమస్యలు, వివిధ రంగాల్లో జరుగుతున్న అన్యాయం, హక్కులపై జరిగిన దాడికి వ్యతిరేకంగా పలు సంఘాలు ఉద్యమాలు సాగించాయి. వీటిన్నింటికి సిపిఎం ముందుండి నాయకత్వం వహించింది. మూడు నెలల క్రితం కొత్తవలసలోని జిందాల్ అక్రమ లేఅవుట్‌కు వ్యతిరేకంగా అక్కడి కార్మికులు చేపట్టిన పోరాటానికి నాయకత్వం వహించింది. దీంతో, యాజమాన్యం తిరిగి ఫ్యాక్టరీని పున:ప్రారంభించక తప్పలేదు. నెల్లిమర్ల మిమ్స్ ఆసుపత్రిలో డిఎల పెంపు, వేతన సవరణ కోసం, యాజమాన్యం వేధింపులు అరికట్టాలని తదితర డిమాండ్లతో ఈ ఏడాది ఫిబ్రవరి 1నుంచి ఏప్రిల్ 21వ తేదీ వరకు 80రోజుల పాటు చేపట్టిన సమ్మెకు సిపిఎం వెన్నంటి నిలిచింది. యాజమాన్యం తోక ముడిచి దిగిరాక తప్పలేదు. పెండింగ్ డిఎ చెల్లింపుతోపాటు వేతన సరవణ కూడా జరిగింది. ఈ ఫలితం వెనుక సిపిఎం నాయకులపై ఐదు కేసులు అక్రమ కేసులు, అరెస్టులు నిర్బంధాలు ఉన్నాయి. మొత్తం 32మందిపై అక్రమ కేసులు బనాయించగా నలుగు మహిళలతో సహా వారంతా జైలు జీవితం అనుభవించారు.

సిపిఎం అండతో 42రోజులపాటు సమ్మెబాట చేపట్టిన అంగన్‌వాడీలు 11డిమాండ్లు సాధించుకున్నారు. వంటవార్పు, ఉద్యమ ఏర్పాట్లు సిపిఎం నాయకులు దగ్గరుండి చూశారు. ఆశావర్కర్ల 36గంటల నిరవధిక దీక్షలకు ఎర్రజెండా బావుటగా నిలిచింది. మున్సిపల్ కార్మికులు, కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పార్టీ అండతో పోరాడి ఎన్నో సమస్యలు పరిష్కరించుకున్నారు. చీపురుపల్లి మండలం కర్లాంలోని పౌల్ట్రీ కార్మికులు సిపిఎం నాయకత్వంలో చేసిన పోరాటం వల్ల యూనియన్ ఏర్పాటు చేసుకోగలిగారు. వేతన విధానం అమల్లోకి వచ్చింది. గరివిడి మండలంలోని ఆక్సైడ్‌ప్లాంట్‌ను యాజమాన్యం పున:ప్రారంభించక తప్పలేదు. గ్రీన్ అంబాసిడర్ల వేతన బాకాయి సాధించారు. సర్వ శిక్షాభియాన్ ఉద్యోగులు 16రోజులు సమ్మె చేపట్టి వారి సమస్యలు పరిష్కరించుకోగలిగారు. కుల వివక్ష, మహిళల అణిచివేత, గృహ హింస వంటి వాటికి వ్యతిరేకంగా సిపిఎం ఎన్నో ఉద్యమాలు సాగించింది. దీంతో, శ్రమ జీవులు, అట్టడుగు ప్రజానీకం, స్కీమ్ వర్కర్లు, ఉద్యోగులు పార్టీకి వెన్నెముకలా నిలుస్తున్నారు.

సఖి పై అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

సఖి కార్యక్రమాలను కొనసాగించాలి

- రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ కార్యదర్శి ఎ.సూర్యకుమారి
- రాష్ట్రమంతటికీ విస్తరించాలి : యునిసెఫ్ చీఫ్ డా.జెలాలెం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జిల్లాలో సఖికార్యక్రమాలను కొనసాగించా లని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ కార్యదర్శి ఎ.సూర్యకుమారి సూచించారు. ప్రజా పోషణ, ఆరోగ్యం, సామజిక, ఆర్థిక, విద్యా సూచికలను మెరుగుపరిచే లక్ష్యంతో 2022లో తాను ప్రారంభించిన సఖి నేడు మంచి ఫలితాల ఇవ్వడం ఆనందంగా ఉందని, ఈ కార్యక్రమాలను జిల్లాలోనే కాకుండా రాష్ట్రమంతటా కొనసాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమాలను కొనసాగిస్తూ బాలుర కోసం కూడా సఖి వంటి గ్రూప్‌లను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను కోరారు. బుధవారం సఖిపై నిర్వహించిన సదస్సులో సూర్యకుమారి వర్చువల్ గా పాల్గొని ప్రసంగించారు. కౌమార దశ లోనే పిల్లలకు నైతిక విలువలను నేర్పించాలని, ప్రస్తుత సోషల్ మీడియా పరిణామాల దృష్ట్యా యువతకు సోషల్ మీడియా వలన కలిగే నష్టాలన వివరించాలని తెలిపారు. అన్ని రెసిడెన్షియల్ స్కూల్స్, హాస్టల్స్ లో సఖి బృందాలను ఏర్పాటు చేసి ఇతరుల పట్ల మర్యాదగా ఉండడం, డ్రగ్స్ కు దూరంగా ఉండడం వంటి అంశాలపై అవగాహన కలిగించాలన్నారు. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాల యునిసెఫ్ చీఫ్ డా.జెలాలెం మాట్లాడుతూ యువత భారత దేశ భవిష్యత్తు అని, సఖి కార్యక్రమాలు రాష్ట్రమంతటికీ విస్తరించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ త్వరలో అన్ని శాఖలతో సమన్వయ (కన్వర్జెన్స్) సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. రెండేళ్లలో సుమారు వెయ్యి గ్రూప్ లు లబ్ది పొందాయని, వీటిని మరింత బలోపేతం చేస్తామని అన్నారు. తొలుత కల్లెక్టరేట్ లో మొదటి అంతస్తు లో డ్వామా కార్యాలయం పక్కన జిల్లా కలెక్టర్ సఖి కార్నర్‌ను ప్రారంభించారు. అంతకుముందు కలెక్టరేట్ నుండి సఖి బందాల వారితో నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి కలెక్టర్ తదితరులు ప్రారంభించారు. అనంతరం కామాక్షి నగర్ వద్ద నున్న ప్రైవేటు భవనం లో సఖి సదస్సును నిర్వహించారు. సఖి బృందాల్లో ఉన్న బాలికలను, మహిళా పోలీస్, ఐసిడిఎస్ సిబ్బందిని తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు డాక్టర్ వివిఎస్ అనిల్ కుమార్, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ హిమబిందు, ఐసిడిఎస్ పీడీ శాంత కుమారి, డిఎంహెచ్‌ఒ డాక్టర్ రాణి, నేచర్ స్వచంద సంస్థ ప్రతినిధులు, పాల్గొన్నారు.

20లోగా బ్యాంకు గ్యారంటీలు సమర్పించాలి

జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

ప్రజాశక్తి-విజయనగరంకోట

ధాన్యం కొనుగోలుకు సంబంధించి మిల్లర్లు బ్యాంకు గ్యారంటీలను ఈనెల 20 లోపల సమర్పించాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. బుధవారం తన ఛాంబర్ లో పౌర సరఫరాల అధికారులు మిల్లర్లతో జెసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైస్ మిల్లర్లు వారికి నిర్దేశించిన లక్ష్యాల మేరకు గోనె సంచులను ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్దేశిత 33 శాతం గోనె సంచులు ఏర్పాటు చేయని యెడల ట్రక్ చిట్ జనరేషన్ జరగదని తెలిపారు. ఒకే మాదిరి తేమ యంత్రాలను కొనుగోలు చేయాలని తెలిపారు. అవసరమైన హమాలీలను కూడా ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో పౌర సరఫరాల జిల్లా మేనేజర్ మీణకుమారి, డిఎస్‌ఒ మధుసూదన్, మిల్లర్లు పాల్గొన్నారు.

100 రోజుల ప్రణాళికల లక్ష్యాలపై జెసి సమీక్ష

స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యాలను శత శాతం సాధించాలని జెసి సేతు మాధవన్ తెలిపారు. బుధవారం ఆయన ఛాంబర్ లో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో 100 రోజుల ప్రణాళికల పురోగతి, వచ్చే వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక, ఏడాది, మూడేళ్ళ, ఐదేళ్ల ప్రణాళిక ల పై సమీక్షించారు. నివేదికలలో ఖచ్చితమైన సమాచారాన్ని పొందుపరచాలని, లక్ష్యాలను సాధించలేకపోతే ఎందుకు సాధించలేదు కారణాలను ఖచ్చితంగా రాయాలని అధికారులకు సూచించారు. వాస్తవాలను పొందుపరచాలని, అందువలన రాష్ట్రంలో మనం ఏ స్థానం లో ఉన్నామో తెలుస్తుందని అన్నారు. జిల్లాను మొదటి లేదా రెండవ స్థానం లో ఉండేలా చూడాలని చూడాలన్నారు. సమావేశంలో వ్యవసాయ, మత్స్య, పశు సంవర్ధక, ఉద్యాన, పట్టు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా మాజీమంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు బుధవారం మంగళగిరి అరణ్య భవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. అటవీ ప్రాంతం తగ్గిపోకుండా పటిష్ఠమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన, డెంకాడ మాజీ ఎంపిపి కందిశేఖరరావు తదితరులు అభినందించారు. -ప్రజాశక్తి, బొబ్బిలి

కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా అప్పలనాయుడు

ప్రజాశక్తి-బాడంగి

రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బాడంగి మండలం కోడూరు గ్రామానికి చెందిన కొల్లి అప్పలనాయుడును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన గత ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపునకు విశేష కృషి చేశారు. ఆయన పార్టీకి చేసిన సేవలను గుర్తించి ఈ పదవికి ఎంపిక చేశారు. ప్రస్తుతం ఆయన టిడిపి బిసి సాధికార సమితి కొప్పుల వెలమ విజయనగరం పార్లమెంట్ కన్వీనర్‌గా ఉన్నారు. తన సేవలను గుర్తించి పదవికి ఎంపిక చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్, జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్, బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన, మాజీఎమ్మెల్యే, బొబ్బిలి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ (బుడా) తెంటు లక్ష్మంనాయుడులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్టతకు చిత్తశుద్ధితో పనిచేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

తాటిపూడిని పరిశీలించిన విఎంఆర్‌డిఎ కమిషనర్

ప్రజాశక్తి-గంట్యాడ

తాటిపూడి ప్రాజెక్టును పరిశీలిస్తున్న కమిషనర్ విశ్వనాధన్, కలెక్టర్

జిల్లాలో పర్యాటకాభివృద్ధికి సహకారం అందించాలని విఎంఆర్‌డిఎ కమిషనర్ కె.ఎస్ విశ్వనాథన్‌ను కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోరారు. కమిషనర్‌తో కలిసి తాటిపూడి రిజర్వాయర్ ను బుధవారం సాయంత్రం కలెక్టర్ పరిశీలించారు. అనంతరం రిజర్వాయర్ కు అవతలి వైపు దిగువకొండపర్తి పంచాయతీ పరిధిలో ఉన్న అతిథి గృహాలను సందర్శించారు. పర్యాటకాభివృద్ధికి ఉన్న అవకాశాలపై చర్చించారు. అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని నిర్ణయించారు. ఈ పర్యటనలో జిల్లా అటవీ శాఖాధికారి ప్రసూన, సిపిఒ పి. బాలాజీ, ఆర్‌డిఒ డి.కీర్తి, తాహశీల్దార్ నీలకంటేశ్వర రెడ్డి, విఎంఆర్‌డిఎ, ఇరిగేషన్, అటవీ శాఖాధికారులు పాల్గొన్నారు.

షాపుల్లో తూనికలు, కొలతలశాఖ అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలో బుధవారం తూనికలు, కొలతలశాఖ అధికారులు ఆటోమొబైల్ షాపులు, ఎలక్ట్రికల్, పండ్ల దుకాణాలు పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఆటోమొబైల్ షాప్‌లపై ఐదు కేసులు, ఎలక్ట్రానిక్ షాపులపై మూడు కేసులు, పండ్ల వర్తకులపై మూడు కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఆటోమొబైల్, ఎలక్ట్రికల్ షాప్ లలో ప్యాకేజీలపై కంపెనీ పూర్తి చిరునామా, గరిష్ఠ ధర, తయారీ తేదీలు లేనట్లు గుర్తించి వారికి ఇకపై నాణ్యత గల ప్యాకేజిలను మాత్రమే విక్రాయించాలని సూచించారు. గంట స్థంభం దగ్గర పండ్ల వర్తకులు కేజీ పై 150 గ్రాములు, అరకేజీ పై 100 గ్రాముల వరకు తూకంలో మోసం చేస్తున్నట్లు గుర్తించి వారికి అపరాధ రుసుము విధించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ దామోదర నాయుడు మాట్లాడుతూ ఎవరైనా తూకంలో గానీ, కొలతల్లో గానీ మోసం చేసినా, అధిక ధరలకు విక్రయించినా తమ శాఖ కు ఫిర్యాదు చేయాలని కోరారు.

యుద్ధ ప్రాతిపదికన పౌంటెన్ల మరమ్మతులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగర అందాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న ఫౌంటెన్ ల మరమ్మత్తులను నగర పాలక సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు. కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో ప్రధాన జంక్షన్ల లో ఏర్పాటు చేసిన కొన్ని ఫౌంటెన్లకు మరమ్మతులను చేపడుతూ మళ్లీ వినియోగంలోకి తీసుకొస్తున్నారు. కార్పొరేషన్ గా రూపాంతరం చెందిన తర్వాత వివిధ ప్రాంతాలలో ఫౌంటెన్లు, ప్రధాన జంక్షన్లు అభివృద్ధి చెందాయి. అయితే కొన్నిచోట్ల ఫౌంటెన్ల నిర్వహణ సరిగా లేకపోవడంతో మరమ్మత్తులకు గురయ్యాయి. ఈ పరిస్థితిని కమిషనర్ తన క్షేత్రస్థాయి పర్యటనలో గమనించి వెంటనే వాటి మరమ్మత్తులను సరిచేయాలని ఇంజినీరింగ్ సిబ్బందికి ఆదేశించారు. దీంతో యుద్ధప్రాతిపదికన ఫౌంటన్ల మరమ్మత్తులు చేపడుతున్నారు. ఎం.ఆర్ కళాశాల సమీపంలో ఉన్న బుద్ధుని విగ్రహం వద్ద ఫౌంటెన్ మరమ్మతులను చేపట్టారు. మిగిలిన చోట్ల కూడా చేపడతామని సిబ్బంది తెలిపారు.

తాగునీరు వృథా చేస్తే ఊరుకునేదిలేదు

తాగునీటిని వృథా చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. బుధవారం నగరంలోని 3వ డివిజన్ మూడవ నెంబర్ సచివాలయ పరిధిలో పర్యటించారు. సమస్యలను తెలుసుకోవడంతో పాటు, అనుమతులు లేని నిర్మాణాలు, ఆక్రమణలను గమనించారు. కుళాయిల ద్వారా పంపిణీ అవుతున్న తాగునీటిని వృథా చేయడాన్ని గమనించారు. తక్షణమే నీటిని వృథా చేస్తున్న వారి కుళాయి కనెక్షన్లను తొలగించాలని సిబ్బందికి ఆదేశించారు. పాదాలమ్మ గుడి పక్కన ఉన్న పార్కులో చెత్తాచెదారాలు నిండి ఉండడాన్ని చూసి సిబ్బందిని మందలించారు. పార్కులలో తక్షణమే జెసిబిల సహాయంతో జంగిల్ క్లియరెన్స్ చేయించాలని సూచించారు. బకాయి పడ్డ ఆస్తి పన్నులను తక్షణమే చెల్లించాలని ప్రజలను కోరారు. టిపిఆర్‌ఒ సింహాచలం సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, ఆర్‌ఐ కిరణ్ కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

జనావాసాల మధ్య మద్యం షాపు వద్దని ధర్నా

పజాశక్తి-బొబ్బిలి

మద్యం షాపు వద్ద ధర్నా చేస్తున్న ప్రజాసంఘాలు

విజయనగరం జిల్లా బొబ్బిలి పట్టణంలోని మేదరబంద జంక్షన్‌లో ఏర్పాటు చేసిన వైన్ షాపును వేరే ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మద్యం షాపు వద్ద, ఆ షాపును అద్దెకు ఇచ్చిన యజమాని ఇంటి వద్ద ఐద్వా, సిపిఎం ఆధ్వర్యాన ధర్నా చేశారు. వెంటనే షాపును అక్కడి నుంచి తరలించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు కె.పుణ్యవతి, సిపిఎం బొబ్బిలి, రామభద్రపురం మండల కన్వీనర్లు ఎస్.గోపాలం, బి.శ్రీనివాసరావు, మహిళలు హెచ్చరించారు. జనావాసాల మధ్య వైన్ షాపు పెట్టకూడదని నిబంధనలు ఉన్నప్పటికీ నిత్యం జనాలతో రద్దీగా ఉండే మేదరబంద జంక్షన్ లో వైన్ షాపు పెట్టడం అన్యాయమన్నారు. నిత్యం మహిళలు, పిల్లలు, వ్యాపారులతో రద్దీగా ఉన్న చోట వైన్ షాపుకు ఎలా అనుమతులు ఇస్తారని అధికారులను ప్రశ్నించారు. అనంతరం షాపును అద్దెకు ఇచ్చిన యజమాని ఇంటి వద్ద నిరసన తెలిపారు వైన్ షాపు వ్యాపారులతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసి వైన్ షాపును ఖాళీ చేయించాలని డిమాండ్ చేశారు.

జనాభా నిష్పత్తి ప్రకారం నిధులేవీ?

- కనిపించని ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ స్ఫూర్తి
- డిబిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చిట్టిబాబు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ చట్ట ప్రకారం గాని, జనాభా నిష్పత్తి ప్రకారంగా గాని ఈ బడ్జెట్లో నిధులు కేటాయింపులు లేవని డిబిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చిట్టిబాబు విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఆయన బుధవారం తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశలంఒ మాట్లాడారు. మొత్తం వార్షిక బడ్జెట్ 2,94,427 కోట్ల లో డెవలప్మెంట్ వ్యయం 1,62,476 కోట్లు కాగా ఇందులో ఎస్సీలకు జనాభా నిష్పత్తి(16.4%) ప్రకారం 26 వేల 646 కోట్లు కేటాయించాల్సి ఉందని, కానీ రూ.18,497 కోట్లు మాత్రమే కేటాయించారని తెలిపారు. ఇది గత ఏడాది బడ్జెట్ కంటే రెండువేల కోట్లు తగ్గాయన్నారు. ఎస్‌టి జనాభాకు (5.3శాతం) అనుగుణంగా రూ.8,611 కోట్లు కేటాయించాల్సి ఉండగా రూ.7,517 కోట్లు మాత్రమే కేటాయించారని, ఫలితంగా ఈ బడ్జెట్‌లో ఎస్సీ ఎస్టీలు సుమారు రూ.9,203 కోట్లు నష్టపోయారని తెలిపారు. మరో పక్క ఎస్సీలకు కేటాయించిన కాంపోనెంట్ నిధుల్లో రూ.18,497 కోట్లలో రూ.6781 కోట్లు (4.2శాతం) మాత్రమే నేరుగా ఉపయోగపడే పథకాలకిచ్చి, నేరుగా ఉపయోగపడని పథకాలకు రూ.11716 కోట్లు కేటాయించడం అన్యాయమని తెలిపారు. ఎస్టీలకు నేరుగా ఉపయోగపడే పథకాలకు రూ.2198 కోట్లు (1.4శాతం) మాత్రమే కేటాయించి నేరుగా ఉపయోగపడని పథకాలకు రూ.5359 కోట్లు కేటాయించడం వలన దళిత ఆదివాసీల సమగ్ర అబివృద్ధి ఎలా సాధ్యమని ప్రశ్నించారు. బడ్జెట్ కేటాయింపులలో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం స్ఫూర్తి కొరవడిందని అన్నారు. అంబేద్కర్ ఓవర్సీస్ నిధికి, ఎన్టీఆర్ విద్యోన్నతి పథకం, కులాంతర వివాహాల ప్రోత్సాహానికి నిధుల కేటాయించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో డిబిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షరాలు పి.సత్యవతి, వై.పోలయ్య, శ్రామిక మహిళా జిల్లా కోఆర్డినేటర్ కోరుకొండ వరలక్ష్మి పాల్గొన్నారు.

ఎల్‌ఐసి ఏజెంట్లకు అన్యాయం తగదు

ఐఆర్‌డిఎ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అభివాదం చేస్తున్న యూనియన్ నాయకులు

ఎల్‌ఐసిలో ఇటీవల యాజమాన్యం ప్రవేశపెట్టిన మార్పుల వల్ల ఏజెంట్ల మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఐఆర్ డిఎ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ ఎన్ గజపతిరావు ఆవేదన వ్యక్తం చేశారు. లైఫ్ ఇన్స్యూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (లియాఫీ) విజయనగరం బ్రాంచ్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా పరిషత్ మినిస్టీరియల్ ఉద్యోగుల భవనంలో విశాఖపట్నం డివిజన్ ఏజెంట్ల సమావేశం జరిగింది.గజపతిరావు మాట్లాడుతూ దేశ నిర్మాణంలో భాగస్వాములైన ఏజెంట్లకు అన్యాయం చేయడం యాజమాన్యానికి తగదన్నారు. ఇటీవల యాజమాన్యం తీసుకున్న తిరోగమన నిర్ణయాల వల్ల ఏజెంట్ల మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని అన్నారు. క్లాబ్లాక్ విధానం దుర్మార్గమని, దీనిని అమలు చేయబోమని రాత పూర్వక హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ విశాఖ డివిజన్ అధ్యక్షుడు బి తిరుమలరావు, కార్యదర్శి ఎన్ విఆర్ వి రావు, ఆలిండియా కమిటీ సభ్యుడు కెవి రమణ, జోనల్ కమిటీ సభ్యుడు బడ్డుకొండ వెంకట రమణ, ఎల్‌ఐసి రిటైర్డ్ ఎంప్లాయిస్స్ యూనియన్ నాయకుడు ఎం శ్రీనివాస, విజయనగరం బ్రాంచ్ అధ్యక్షుడు చిల్ల రామకష్ణ, కార్యదర్శి ఇల్లాపు కష్ణ కోశాధికారి తుమ్మలగుంటి పవన్ కుమార్, యూనియన్ గౌరవ అధ్యక్షుడు సబ్బవరపు సూరినాయుడు, డివిజన్ ఉపాధ్యక్షుడు జరజాపు వాసుదేవరావు, యూనియన్ నాయకులు నాగేంద్ర, శివకుమార్, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సిసి కెమెరాలు ఏర్పాటు : ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరంకోట



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్ జిందాల్

నేరాల నియంత్రణకు షాపులు, వాణిజ్య సముదాయాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకొనేలా ప్రజలను, అధికారులను ప్రోత్సహించాలని ఎస్‌పి వకుల్ జిందాల్ పోలీసు అధికారులకు సూచించారు. ఏడేళ్లకు పైబడి పైబడి శిక్షలు విధించే కేసుల్లో నిందితుల వేలిముద్రలు సేకరించాలని తెలిపారు. జిల్లాపోలీసు కార్యాలయంలో బుధవారం నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నియంత్రణకు 'సంకల్పం' కార్యక్రమాన్ని అన్ని కళాశాలల్లో నిర్వహించాలని ఆదేశించారు. రాత్రి గస్తీ, పెట్రోలింగును మరింత పటిష్టవంతం చేయాలన్నారు. వాహనాలకు సైరన్ అమర్చుకుని ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు రాత్రి11గంటల తరువాత అకారణంగా తిరిగే వ్యక్తులను స్టేషనుకు తరలించి, కౌన్సిలింగు నిర్వహించాలని సూచించారు. హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తులను వారంలో ఒక రోజు స్టేషను పిలిపించి, మాట్లాడాలన్నారు. వివిధ కేసుల్లో సీజ్ చేసిన ప్రాపర్టీని ప్రత్యేకమైన కార్డు బోర్డుల్లో భద్రపర్చాలన్నారు. డయల్ 112/100కు వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని తెలిపారు. ఎఎస్‌పి పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్‌పి జి.నాగేశ్వరరావు, డిఎస్‌పిలు ఎం.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, ఎస్.రాఘవులు, వీరకుమార్, యూనివర్స్, సిఐలు,ఎస్‌ఐలు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ కోచ్‌గా శ్రీరాములు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణానికి చెందిన డాక్టర్ పొట్నూరు శ్రీరాములు ఈనెల 17నుండి 21వ తేదీ వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రం, నర్మదాపురంలో జరగబోవు జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ బ్యాడ్మింటన్ అండర్ 17 పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టుకు కోచ్‌గా ఎంపికయ్యారు. ఈయన ప్రస్తుతం ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శ్రీరాములు భారత బ్యాడ్మింటన్ అసోసియేషన్ గ్రేడ్-1 అంపైర్‌గా, అనేక రాష్ట్ర జాతీయ, అంతర్జాతీయ పోటీలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. శ్రీరాములు ఎంపిక పట్ల జిల్లా విద్యాశాఖ అధికారి యు.మాణిక్యంనాయుడు, ఎస్‌జిఎఫ్ కార్యదర్శి కె. కృష్ణంరాజు, ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బంగారు ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఛైర్మన్ ఇందుకూరి రఘురాజు, గౌరవ అధ్యక్షులు ద్వారపురెడ్డి జగదీష్, అధ్యక్షులు డాక్టర్ కెఎ నాయుడు, సహాధ్యక్షులు డాక్టర్ విఎస్ ప్రసాద్, ఎంకెబి శ్రీను, అట్లూరి శ్రీ వెంకట్రావు, కార్యదర్శి నున్న సురేష్, ఎస్.కోట గ్రామ పెద్దలు డాక్టర్ ఎస్‌వి సత్య శేఖర్, ఆనల మోహన్, ఆనల రమేష్, మంత సుబ్బారావు, కోచ్ ఎండి ఖలీలుల్లా, గ్రామ క్రీడాకారులు అభినందించారు.

వరిలో పంటకోత ప్రయోగాలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వీలుపర్తి యూనిట్ రాయుడుపేట గ్రామంలో రీజినల్ టీం టెక్నికల్ ఆఫీసర్ హేమసుందర్ ఆధ్వర్యంలో బుధవారం వరి పంటలో పంట కొత ప్రయోగాలు చేశారు. ఈ పంట కోత ప్రయోగం వల్ల రైతులకు ఎంత దిగబడి వస్తుందో వివరించారు. దీని వల్ల రైతు చేసిన ఖర్చు, ఆదాయం లెక్కించారు. రైతు వాడుతున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతుల వల్ల రైతులకు ఎంత పెట్టుబడి మిగిల్చుకోవచ్చున్న వివరాలను వెల్లడించారు. అనంతరం లెంక సత్యవతి వరి పొలంలో పంట కోత ప్రయోగం చేశారు. ఎకరాకు ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల 30 బస్తాల దిగబడి రైతుకు వచ్చిందన్నారు. రసాయనిక వ్యవసాయంతో పోల్చుకుంటే ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల ఐదు బస్తాలు అధనంగా వచ్చినట్లు ఆయన వెల్లడించారు. రైతులంతా ప్రకృతి వ్యవసాయం వైపు మారాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో విఎఎ జ్యోతీ, ఎంటిఎల్ వసంత, ఎంటిఎస్ యూనిట్ ఇంఛార్జులు, మెంటర్స్, ఫార్మా సైంటిస్టులు, సభల్ టీం, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి - రామభద్రపురం

బాలల దినోత్సవం సందర్భంగా మండలంలోని నాయుడు వలస ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు జెసి రాజు ఆధ్వర్యంలో బుధవారం ఆటల పోటీలను నిర్వహించారు. ఆటల పోటీలతో పాటు చిత్ర లేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించామని ప్రతిభ చూపి గెలుపొందిన విద్యార్థులకు గురువారం పాఠశాలల్లో నిర్వహించనున్న జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా బహుమతులు ప్రదానం చేయనున్నట్లు హెచ్ఎం రాజు తెలిపారు. ఈ పోటీలను ఉపాధ్యాయులు రవి, కృష్ణ, వెంకటరమణ, కృష్ణంనాయుడు, సత్యం నిర్వహించారు.

జనసేన నాయకుల ఆర్థిక సాయం

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని రావాడ గ్రామంలో అగ్ని ప్రమాదం జరిగి సమస్తం కోల్పోయిన బాధితులు పోలిపల్లి శాంత, వరలక్ష్మిలకు మండల జనసేన నాయకులు బుధవారం ఆర్థిక సహాయం అందించారు. ఎమ్మెల్యే లోకం మాధవి ఆదేశాలు మేరకు భోగాపురం జనసేన మండల పార్టీ అధ్యక్షుడు వందనాల రమణ, మట్ట అయ్యప్ప రెడ్డి, చెల్లిబోయిన నర్సింగరావు, కొండాపు రాధాకృష్ణ, బొల్లు త్రినాథ్, లంక సత్యనారాయణ, రావాడ జనసేన నాయకులు సహాయంతో రూ.15వేలు విలువ చేసే నిత్యవసర సరుకులు, రూ.10 నగదు బాధితులకు అందించారు. ఈ కార్యక్రమంలో రావాడ జనసేన నాయకులు గండిబోయిన రాంబాబు, మూర్తి, సీతంనాయుడు, పైడిరాజు, కిరణ్, సుధీర్, శంకర్, అప్పారావు, మహాలక్ష్మి, కృష్ణ, శ్రీను, వాళ్ల మోహన్, బండారు మోహన్, అప్పలరాజు, బొగత రాంబాబు, కొలి రాంబాబు, కొయ్య నర్సింగ్, ప్రజలు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కొత్తవలస

ఈ నెల 16,17 విజయనగరంలో జరగనున్న సిపిఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సిపిఎం నాయకులు గాడు అప్పారావు కోరారు. ఈ మేరకు బుధవారం పాత సుంకరపాలెం ఉపాధి పనులు చేపడుతున్న కూలీల దగ్గరకు వెళ్లి కార్మికులు కోల్పోతున్న ఉపాధి హామీ పనులు గూర్చి, మార్కెట్లో పెరిగిన నిత్యవసర వస్తువుల ధరల గూర్చి, పెరిగిన విద్యుత్ ఛార్జీలు గురించి వివరించారు. ధరలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో ఆ ధరలకు అనుగుణంగా రోజు వారి కూలి రేటు పెంచి జాబ్ కార్డు ఉన్న కార్మికుల కుటుంబానికి సంవత్సరానికి 200 రోజులు పది దినాలు కల్పించాలన్నారు. రోజు కూలి 600 రూపాయలు నిర్ణయించి అమలు చేయాలన్నారు. వీటిని పటిష్టంగా అమల కోసం నిర్వహిస్తున్న జిల్లా మహాసభలకు ఉపాధి కూలీలంతా కదిలి రావాలని మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

కార్మికుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండలంలోని గర్భాం గ్రామానికి చెందిన తాడ్డి రాంబాబు ఇటీవల రోడ్ ప్రమాదంలో మృతి చెందాడు. ఈయన ఎస్ఎంఎస్ కంపెనీలో దినసరి వేతనంతో పనిచేసేవాడు. దీంతో కంపెనీ యాజమాన్యం, కార్మికులు రాంబాబు కుటుంబాన్ని ఆదుకోవటం కోసం రూ.1.20లక్షలు మృతుని భార్యకు బుధవారం అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ యూనిట్ హెడ్ వాకాడ గోపి, వివిధ విభాగాల మేనేజర్స్ పక్కి శ్రీనివాసరావు, ఉప్పు శ్రీనివాసరావు, శివకుమార్, సత్యనారాయణ, సరిది రాంబాబు, కామేష్, బొత్స రాము, బొమ్మన సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మంగళపాలెంలో వ్యక్తి హత్య

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని దేశపాత్రుని పాలెం పంచాయతీ మంగళపాలెం రెల్లి వీధిలో నివాసం ఉంటున్న కసింకోట అప్పారావు(42) హత్యకు గురయ్యాడు. అతని దగ్గర బంధువైన మేనల్లుడు బంగారం రాము అప్పారావు ఛాతిపై తన్నడంతో మృతి చెందినట్లు కొత్తవలస పోలీసు స్టేషన్‌లో మృతుని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మంగలపాలెం రెల్లి వీధిలో నివాసం ఉంటున్న కసింకోట అప్పారావు తన సమీప బంధువైన మేనల్లుడు బంగారం రాము మధ్య బుధవారం చిన్న వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో ఇద్దరూ కొట్టుకున్నారు. రాము అప్పారావును చాతిపై తన్నడంతో అప్పారావు మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న సిఐ షణ్ముఖరావు, శివ పంచనామా నిమిత్తం మృతదేహాన్ని శృంగవరపుకోట సిహెచ్‌సికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఐదు కిలోల గంజాయితో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి- విజయనగరం కోట

విజయనగరం రూరల్ పోలీసు స్టేషను పరిధి ద్వారపూడి గ్రామ శివార్లలో ముగ్గురు వ్యక్తులు గంజాయి అమ్ముతుండగా అరెస్టు చేసినట్లుగా డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన వివరాలను వెల్లడించారు. మంగళవారం విజయనగరం రూరల్ ఎస్ఐ వి.అశోక్ కుమార్‌కు కొంత మంది వ్యక్తులు ద్వారపూడి గ్రామం శివారులో గంజాయి అమ్ముతున్నట్లుగా వచ్చిన సమాచారంపై సిఐ బి.లక్ష్మణరావుతో కలిసి రైడ్ చేశారు. పోలీసు బృందాన్ని చూసి, ముగ్గురు వ్యక్తులు పారిపోతుండగా పట్టుకొని విచారణ చేశారు. అందులో మునకాల జగన్నాధం అనే వ్యక్తి రైల్వే స్టేషన్ దగ్గర నివాసం ఉంటూ ఒడిస్సా రాష్ట్రానికి సంబంధించిన వ్యక్తి దగ్గర 5 కేజీల గంజాయి కొని, ద్వారపూడి దగ్గరలో విజయనగరానికి చెందిన బోని అఖిల్, మార్తి వెంకట ఆదిత్యకు చెరో కేజీ అమ్మాడు. మిగిలిన మూడు కేజీల అతని వద్దనే ఉంచుకున్నాడు. దీంతో రైడ్ చేసి వారి ముగ్గురుతో పాటు 5 కిలోల గంజాయిని డిప్యూటీ తహశీల్దార్ బి.సంజీవకుమార్ సమక్షంలో స్వాధీనం చేసికొని, వారి నుండి 2 మొబైల్స్, రూ 2050 నగదు సీజ్ చేసినట్లు డిఎస్‌పి తెలిపారు. ఈ ముగ్గురునూ రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కేసులో క్రియాశీలకంగా పని చేసిన సిఐ లక్ష్మణరావు, ఎస్ఐ అశోక్ కుమార్‌ను ఆయన అభినందించారు.

గంజాయి కేసులో పరారైన వ్యక్తి అరెస్ట్

శృంగవరపుకోట: గంజాయి తరలిస్తున్న కేసులో పరారైన వ్యక్తిని బుధవారం అదుపులోకి తీసుకున్నామని సిఐ వేచలపు నారాయణమూర్తి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గత సంవత్సరం మే నెలలో అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగూడ మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులను ద్విచక్ర వాహనంపై గంజాయితో ఎస్‌కోట వైపు వస్తుండగా పట్టుకున్నాం. ఈ సమయంలో ఒక వ్యక్తి దొరకగా మరొక వ్యక్తి బైక్‌తో పాటు పరారయ్యాడు. పరారైన వ్యక్తిని బుధవారం పట్టణంలోని పందిరి అప్పన్న జంక్షన్ వద్ద బైక్‌తో పాటు పట్టుకొని కోర్టులో హాజరు పరిచామని ఆయన తెలిపారు

పేరుకే స్టాక్ పాయింట్

- డెంకాడ వద్ద లభ్యం కాని ఇసుక
- ఎక్కడ నిర్మాణాలు అక్కడే
- ఇబ్బందులు పడుతున్న భవన నిర్మాణ కార్మికులు

ప్రజాశక్తి- డెంకాడ

ప్రభుత్వం ఉచిత ఇసుక అని చెబుతున్న ఆచరణలో సాధ్యం కాకపోవడంతో భవన నిర్మాణ కార్మికులు పనుల్లేక అవస్థలు పడుతున్నారు. ఇసుక లేక ఎక్కడ నిర్మాణాలు అక్కడే ఆగిపోయాయి. అందరికీ ఉచిత ఇసుక ఇస్తామన్న పేరుతో మండలంలో పెద్ద తాడివాడ వద్ద ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వంలో స్టాక్ పాయింట్‌లో ఉన్న ఇసుకను రెండు రోజుల్లో అమ్మేశారు. ఇప్పుడు స్టాక్ పాయింట్ వద్ద ఇసుక లేక ఇబ్బందులు పడుతున్నారు. పేరుకే స్టాక్ పాయింట్ కానీ ఇసుక మాత్రం లేదు. అలా అని దగ్గర్లో ఉన్న చంపావతి నదిలో కూడా ఇసుక లేదు. ఉచిత ఇసుక ప్రకటనలకే తప్ప ఆచరణలో కానరావడం లేదని నిర్మాణ రంగంలో ఉన్న కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడో శ్రీకాకుళం నుంచి ఇసుక తెచ్చుకోవాలనుకుంటే నానా ఇబ్బందులు పడవలసి వస్తుందని భవన నిర్మాణ యజమానులు అంటున్నారు. శ్రీకాకుళం నుంచి ఇసుకను తెచ్చుకుంటే తడిసి మోపుడు అవుతుందని, అధనపు ఖర్చు అవుతుందని వాపోతున్నారు.

రవాణా భారం

జిల్లాలో డెంకాడ, బొబ్బిలి వద్ద తొలుత స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం బొబ్బిలి వద్ద మాత్రమే ఇసుక లభ్యమవుతుంది. డెంకాడ వద్ద స్టాక్ పాయింట్‌లో ఇసుక లేదు. దీంతో చేసేదేమీ లేక చాలా మంది శ్రీకాకుళం నుంచి ఇసుకను తెప్పించుకుంటున్నారు. ఫలితంగా మూడు యూనిట్లు ఇసుక శ్రీకాకుళం నుంచి ఇక్కడికి తెచ్చుకునేందుకు సుమారు రూ.20వేలు ఖర్చవుతుంది. ఇంత ఖర్చు పెట్టి ఇసుకను తెప్పించుకోవడం అనవసరమని భావిస్తున్న ఇంటి నిర్మాణ యజమానులు పనులు నిలిపేస్తున్నారు. దీంతో పనులు లేకపోవడంతో రోజువారి కూలీలు మరీ ఇబ్బందులకు గురవుతున్నారు. కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలని వాపోతున్నారు. ఇవ్వటికైనా ప్రభుత్వం ఇసుక పాయింట్లో ఇసుకను ఏర్పాటు చేసి ఉచిత ఇసుక అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై స్థానిక తహశీల్దార్ వి.పద్మావతిని వివరణ కోరగా ఇక్కడ స్టాక్ పాయింట్‌లో ఇసుక లేదని, బొబ్బలిలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌లో ఇసుక ఉందని అక్కడి నుంచి తెప్పించుకోవాలని చెబుతున్నారు.

పరిమితికి మించి భారీ వాహనాలతో ఇసుక తరలింపు

నెల్లిమర్ల: పరిమితికి మించి భారీ వాహనాలతో ఇసుక అక్రమంగా తరలిపోతుంది. బుధవారం స్థానిక రామతీర్థం జంక్షన్‌లో భారీ వాహనాలతో ఇసుక అక్రమంగా తరలిస్తున్న దృష్యాలు కనిపిచాయి. అయితే ఈ భారీ ఇసుక వాహనాలు శ్రీకాకుళం నుంచి రణస్థలం మీదుగ రామతీర్థం జంక్షన్ నుంచి జిల్లా కేంద్రానికి తరలిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా ఈ వాహనాలు ఒరిస్సా పర్మిట్‌తో శ్రీకాకుళం నుంచి ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం. ఈ భారీ వాహనాలకు 20 టన్నులకు మాత్రమే పర్మిట్ ఉన్నా 50 టన్నులకు పైగా ఇసుక తరలిస్తున్నారని తెలుస్తోంది. దీని వల్ల రహదార్లు కూడా శిథిలావస్థకు చేరుతున్నాయి. పరిమితికి మించి ఇసుక లోడు వేసుకునేందుకు గాను ఒక్కొక్క వాహనానికి 8వేల రూపాయలు సంబంధిత అధికార్లకు వాహన యజమానులు ముట్ట చెబుతున్నట్లు సమాచారం. దీంతో సంబంధిత అధికార్లు చూసి చూడనట్లు వ్యవరిస్తున్నట్లు విమర్శలు వినవస్తున్నాయి. కాగా ఇదే అధికార్లు మామూలు ముట్ట జెప్పని రెండు మూడు టన్నులు అధికం వచ్చిన వారిపై కేసులు బనాయించి 40వేల రూపాయలకు పైగా ఫైన్ వేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. శ్రీకాకుళం, విజయనగరం కూటమి నేతల సహకారంతో ఇసుక దందా జరిపిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా అదికార యంత్రాంగం మామ్ముళ్ళ మత్తు వదిలి పరిమితికి మించి ఇసుక తరలిస్తున్న వాహనాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నెల్లిమర్ల: ఓవర్ లోడ్‌తో వెళుతున్న ఇసుక లారీ

ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం

ఆర్‌డిఒ సత్యవాణి

ప్రజాశక్తి- రేగిడి

రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని చీపురుపల్లి ఆర్‌డిఒ సత్యవాణి సూచించారు. బుధవారం రెవెన్యూ కార్యాలయంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖ అసిస్టెంట్లుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతు సేవా కేంద్రాల నుంచి కొనుగోలు చేయాలని సూచించారు. ముందుగా రైతుల నుంచి కొనుగోలు రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేయాలన్నారు. ఆ జాబితా ప్రాప్తికి ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. ప్రభుత్వ నిర్దేశించిన రేట్లుకే రైతు ఖాతాలోకి బిల్లులు జమచేయాలన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలన్నారు. పేరుకుపోయిన నీటి తీరువా బకాయిలు వసూలుకు కృషి చేయాలన్నారు. నీటి సంఘాల ఎన్నికల జాబితా సచివాలయ పరిధిలో నోటీసు బోర్డులో అంటించాలన్నారు. ప్రజా సమస్యల అర్జీలు తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొటేషన్ ప్రక్రియ, భూ రీ సర్వే సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సచివాలయ పరిధి విఆర్‌ఒలు సమయాలు పాటించి ప్రతి దరఖాస్తు క్షుణ్ణంగా పరిశీలించి జారీ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఇంఛార్జి తహశీల్దార్ చిన్నారావు, ఎంపిడిఒ శ్యామల కుమారి, ఎఒ మురళీ కృష్ణ, ఎపిఎం గోవిందరావు, ఆర్ఐ రేవతి, సిఎస్‌డిటి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్‌డిఒ సత్యవాణి

వైద్యులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ రామ్మోహన్‌రావు

ఆడపిల్లల పట్ల వివక్షత చూపితే చర్యలు

ప్రజాశక్తి- బొబ్బిలి

ఆడపిల్లలు పట్ల వివక్షత చూపితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఆర్‌డిఒ రామ్మోహనరావు కోరారు. తన కార్యాలయంలో బుధవారం పిసి అండ్ పిఎన్‌డిటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలు పట్ల వివక్షత చూపితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లింగవివక్షత చూపడం చట్టరీత్యా నేరమన్నారు. ల్యాబ్‌లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. మూఢ నమ్మకాలు నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో వైద్యులు సంతోషికుమారి, రోజారాణి, శాంతి, అంగన్వాడీ సూపర్ వైజర్ రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సింగరాయిలో వైద్య సేవలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సింగరాయి గ్రామంలో హెల్త్ సెంటర్ వద్ద బుధవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం విజయవంతమైంది. 104 సిబ్బంది అందించిన వైద్య సేవలకు సుమారు 50 మంది హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వేపాడ పిహెచ్‌సి వైద్యాధికారి ఎ.ధరణీ, హెల్త్‌సెంటర్ సిహెచ్‌ఒ పార్ధసారథి, హెచ్‌ఎడి సత్యానారాయణ, 104 సిబ్బంది మహేష్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వైద్య తనిఖీలు చేస్తున్న డాక్టర్ ధరణి

‘నేటి బాలలే రేపటి జ్ఞాపకాలు’

నేడు బాలల దినోత్సవం

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

అబాలిక జ్ఞాపక శక్తికి ప్రపంచ నోబెల్ బుక్కే అబ్బుర పడింది. మండలంలోని కొత్తపెంటకు చెందిన సిరికి లక్ష్మునాయుడు హారిక దంపతుల కుమార్తె ధన్విక ఐదు నెలల ప్రాయంలోనే 120 ఫ్లాష్ కార్డులను గుర్తించి ప్రపంచ నోబెల్ బుక్‌లో స్థానం సంపాదించింది. ధన్వికకు తల్లిదండ్రులు రెండు నెలల వయస్సు నుండి వివిద రకాల బొమ్మలు, వస్తు వులు, కూరగాయలు, మ్యాప్‌లు పండ్లు, రంగులు, వివిధ దేశాల జెండాలు గుర్తు పట్టేట్లు శిక్షణ ఇచ్చారు. చిన్నారి అమోఘమైన జ్ఞాపకశక్తి ద్వారా వాటి అన్నింటిని గుర్తించి చెప్పేది. దీనిని వీడియో ద్వారా నోబెల్ సంస్థకు పంపించడంతో సంస్థ ప్రతినిధులు చిన్నారి రికార్డులను గుర్తించి బుక్‌లో స్థానం కల్పించారు. ప్రశంసా పత్రం, మెడల్స్‌ను గతనెల 20వ తేదీన మంత్రి గుమ్మడి సంధ్యరాణి ద్వారా అందజేశారు. బాలలుగా అందుకొన్న ఇలాంటి జ్ఞాపకాలను తల్లిదండ్రులు పదిలి పరుచుకొంటారు.

నోబెల్ బుక్ అందించిన ప్రశంసా పత్రం, అవార్డుతో ధన్విక

అభివృద్ధికి మరో పేరు బొత్స

ప్రజాశక్తి - గజపతినగరం

అభివృద్ధికి మరో పేరు మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య అని జెడ్‌పిటిసి గార తవుడు, వైసిపి నేతలు అన్నారు. బుధవారం స్థానిక వైసిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొత్స అప్పలనరసయ్య ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో రోడ్ల విస్తరణ, అభివృద్ధి చేశారన్నారు. భారీ వాహనాలు సైతం మునిగిపోయేంత గుంతలను పూడ్చి కొత్త రోడ్లను, చంపావతి నదిపై బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తిచేసి, విద్యుత్ కాంతులతో వెలుగులు నింపిన వ్యక్తి అని గుర్తు చేశారు. గ్రామాల్లో సిసి రోడ్లను సైతం పూర్తి చేశారని, ప్రజల ఆరోగ్యం దృష్ట్యా సిహెచ్‌సిను ఏరియా ఆసుపత్రిగా అభివృద్ధి చేశారని చెప్పారు. ప్రతి గ్రామంలో సచివాలయం, ఆర్‌బికె, హెల్త్ వెల్నెస్ సెంటర్లు, డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేసిన అభివృద్ధి టిడిపి నేతలకు కనిపించలేదా అని ప్రశ్నించారు. కక్షపూరిత రాజకీయాలను తాము ఎప్పుడు ప్రోత్సహించలేదని పార్టీలకు అతీతంగా పాలన అందించామని చెప్పారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ నాయకులు వాటికి తెర లేపారని విమర్శించారు. అధికారంలో ఏ పార్టీ ఉంటుందో ఆ పార్టీలోకి వెళ్లి విమర్శలు చేసే వ్యక్తులము తాము కాదని, ప్రస్తుతం విమర్శలు చేస్తున్న వ్యక్తి తమ పార్టీ నుండే వెళ్లాడన్న సంగతి గుర్తుంచుకోవాలని హితవుపలికారు. అభివృద్ధిపై ఎక్కడైనా ఎప్పుడైనా బహిరంగ చర్చకు తాము సిద్దమని మీరు సిద్ధమా అని సవాల్ చేశారు. ఈసమావేశంలో వైసిపి నాయకులు బెల్లాన త్రినాధరావు, కరణం ఆదినారాయణ, కె.పైడపునాయుడు, కర్రి రామునాయుడు, ఈదుబిల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

19లోగా మిల్లు తెరిపించాలి

జ్యూట్ మిల్ వర్కర్స్ యూనియన్ డిమాండ్

ప్రజాశక్తి- నెల్లిమర్ల

ఈ నెల 19లోగా జ్యూట్ మిల్ తెరిపించాలని జ్యూట్ మిల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన నెల్లిమర్లలో విలేకర్లతో మాట్లాడుతూ జ్యూట్ మిల్ అక్రమ లాకౌట్‌పై ఈ నెల 12న జ్యూట్ యాజమాన్యం, విశాఖపట్నం లేబర్ కమిషనర్, తనను సంయుక్త సమావేశానికి రావాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. జ్యూట్ యాజమాన్యం గత ఆరు నెలలుగా అక్రమ లాకౌట్ చేసిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని ఈ నేపథ్యంలో విశాఖపట్నం లేబర్ కమిషనర్ 12న జాయింట్ మీటింగు ఏర్పాటు చేశారన్నారు. అయితే జ్యూట్ యాజమాన్యం ఈ మీటింగ్‌కు గైర్హాజరు కావడంతో ఈనెల 19న మరొక్కసారి జ్యూట్ యాజమాన్యంతో జాయింట్ మీటింగుకు జ్యూట్ మిల్ వర్కర్స్ యూనియన్ తరపున తనను కూడా హాజరు కావాలని ఉత్తర్వుల్లో లేబర్ కమిషనర్ పేర్కొన్నారని రామారావు చెప్పారు. జ్యూట్ యాజమాన్యం ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఈ ఎస్ఐ, పిఎఫ్ బకాయిలు చెల్లించలేదు సరికదా అక్రమంగా లాకౌట్ చేసి కార్మికులను ఉపాధి లేకుండా రోడ్డున పడేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. జ్యూట్ యాజమాన్యం ఈనెల 19లోగా మిల్లు తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. అలకాని పక్షంలో కార్మికులతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

నేటి నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

శృంగవరపుకోట: పట్టణంలో గల శాఖ గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈనెల 14వ తేది నుండి 20వ తేదీ వరకు నిర్వహించనున్నామని శాఖ గ్రంథాలయాధికారి దామోదర శ్రీధర్ బుధవారం తెలిపారు. ఈ వారోత్సవాలలో స్కూల్ విద్యార్థులు ప్రతిరోజు పాల్గొనాలని ఆయన కోరారు.

డెంకాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ప్రారంభమవుతాయని వారం రోజులు పాటు చేపట్టనున్న ఈ వారోత్సవాలను జయప్రదం చేయాలని శాఖా గ్రంథాలయాధికారి మహేష్ కోరారు. తొలి రోజు కార్యక్రమానికి ఎంపిడిఒ, తహశీల్దార్ హాజరవుతారని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థులకు ఈ వారం రోజులు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తామన్నారు.

రేగిడి: మండల కేంద్రంలో శాఖ గ్రంథాలయంలో ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథలయాధికారి ఈశ్వరరావు తెలిపారు. వారం రోజుల్లో భాగంగా ప్రతిరోజు వారోత్సవాల్లో అతిధులచే ఉపన్యాసాలు, విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్, రంగవల్లికలు, తెలుగు న్యూస్ పేపర్ రీడింగ్ తదితర పోటీలు నిర్వహిస్తామన్నారు. పాఠకులు పెద్ద సంఖ్యలో గ్రంథాలయమునకు హాజరు కావాలని ఆయన కోరారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు

ప్రజాశక్తి - సంతకవిటి

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపిడిఒ సురేష్ కుమార్ అన్నారు. బుధవారం ప్రణాళికలు అమలపై స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో సర్పంచులు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలు అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులు 15వ ఆర్థిక సంఘం ప్రకారం గ్రామాల్లో తాగునీరు, పారిశుద్యం కే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గ్రీన్ అంబాసిడర్ కార్మికులచే ప్రతి రోజు గ్రామాన్ని శుభ్రం చేయించాలన్నారు. గ్రామాల్లో మహిళలు, బాలలు, వికలాంగుల సమస్యలు గూర్చి వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎఒ ఎస్ రఘునాథ చారి, ఎంపిటిసిలు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సదస్సును జయప్రదం చేయండి

శృంగవరపుకోట: ఈ నెల 15న పిడియస్‌ఒ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర కరువు, వలసలు - విద్యా, ఉపాధి రంగ సమస్యలు - కర్తవ్యాలు అనే అంశంపై విజయనగరంలో జరిగబోయే సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ ఎస్. కోట టౌన్ కన్వీనర్ బి.రాజేష్ మాట్లడుతూ అనాది కాలంగా ఈ ఉత్తరాంధ్రా ప్రాంతాన్ని నిత్యం కరువు, వలస ప్రాంతంగా ఉంచే విధానాలనే అన్ని పాలక పార్టీలు కొనసాగిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌ఒ సభ్యులు బాల రాజు, మనోహర్, రవి, వంశీ విద్యార్థులు పాల్గొన్నారు.

వయోజనులను అక్షరాస్యులుగా మార్చాలి

ప్రజాశక్తి - గజపతినగరం

నిరక్షరాస్యతను తగ్గించేందుకు నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపిడిఒ బి.కళ్యాణి అన్నారు. బుధవారం స్థానిక డిగ్రీ కళాశాలలో గల సమావేశ మందిరంలో నిర్వహించిన ఉల్లాస్ వాలంటీర్ శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ అక్షరాస్యతను పెంచి నిరక్షరాస్యతను తగ్గించాలని సదుద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. మండలంలో ఈ సంవత్సరం 1835 మంది నిరక్ష్యరాశులని గుర్తించామని ప్రతి పదిమందికి ఒక వాలంటీర్ చొప్పున 183 మందిని నియమించామని చెప్పారు. వారికి రెండు బ్యాచ్‌లలో రెండు రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. మార్చి 31లోగా వారిని అక్షరాస్యులుగా మార్చే విధంగా వాలంటీర్‌లు పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా డి.ఎల్.డి.ఒ కిరణ్, ఎంఇఒలు విమలమ్మ, చక్రవర్తి, వెలుగు ఎపిఎం సత్యనారాయణ, అడల్ట్ ఎడ్యుకేషన్ సూపర్‌వైజర్ జయరాం, విఒఎలు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : వయోజనులను అక్షరాస్యులుగా మార్చాలని ఎంపిడిఒ కె. రామకృష్ణరాజు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా వెలుగు విఒఎ, ఆర్‌పిలకు వయోజన విద్య పై రెండు రోజులు పాటు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని సూచించారు. ముఖ్యంగా ఆయా గ్రామాల్లో నిరక్షరాస్యులైన వయోజనులను గుర్తించి వారికి సులభతరంగా అక్షరాల నుంచి పదాలు నేర్పించి బాధ్యత తీసుకోవాలని కోరారు. వయోజనులు పూర్తి స్థాయిలో అక్షరాస్యులుగా మారితే ఆయా గ్రామాలు అభివృద్ధి చందుతాయన్నారు. అనంతరం ఎంఇఒ ఈపు విజయ్ కుమార్, ఎంఎల్‌ఒ టి.శ్రీనివాసరావు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఎపిఎం సురేష్, ఐసిడిఎస్ సూపర్ వైజర్ పాల్గొన్నారు.

వేపాడ: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో రెండు రోజులు జరిగే ఉల్లాస్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ సూర్యనారాయణ, తహశీల్దార్ జె. రాములమ్మ శిక్షణా కార్యక్రమానికి హాజరైన విఒఎలతో మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సమాజంలో అందరికీ జీవితకాలంపై, విద్య అవసరంపై శిక్షణ ఇస్తున్నామన్నారు. గ్రామంలో ఉన్న 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నిరక్షరాస్యులైన మహిళలకు గుర్తించి వారికి అక్షరాలు నేర్పించే బాధ్యత గ్రామస్థాయిలో విఒఎలదేనన్నారు. గ్రామాల్లో విఒఎలకు ఒకరికి పది మంది చొప్పున నిరక్ష్యరాశులను అక్షరాసులుగా తయారు చేయడం లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమం మార్చి 2 వరకు కొనసాగుతుందని చెప్పారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎంఎల్‌ఒ సిహెచ్ ఈశ్వర అప్పారావు, వెలుగు ఎపిఎం, ఎంఇఒ బాలభాస్కరరావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ బి. కళ్యాణి

బొండపల్లి: స్వయం సహాయక సంఘాల సభ్యులలో గల నిరక్ష్యరాస్యులను అక్షరాస్యులను చేయడంలో ఎస్‌హెచ్‌జిలు భాగస్వామ్యం కావాలని ఎంపిడిఒ జి.గిరిబాల అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో సుమారు 1830 మంది సభ్యులు వివిధ సంఘాలలో నిరక్ష్యరాస్యులుగా గుర్తించామన్నారు. ఈ నిరక్ష్యరాస్యులను సంఘంలో ఉన్న చదువుకున్న ఒకొక్క సభ్యురాలు పది మందిని అక్షరాస్యులను చేయాలని ఆమె సూచించారు. సంఘ సభ్యులందరూ అక్షరాస్యులు అయినపుడే బ్యాంకు లావాదేవీలు, సంఘ తీర్మానాలపై పూర్తి అవగాహన ఏర్పడుతుందని అన్నారు. సమావేశంలో ఎంఇఒ శోభారాణి, వెలుగు ఎపిఎం పెంటం నాయుడు, ఎపిఒ బి.కృష్ణవేణి, టిఒటి ఎం.శ్రీనువాస రావు తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: మండలంలో వెలుగు కార్యాలయం వద్ద ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా సీసీలకు, విఒఎలకు, వాలంటరీ టీచర్లకు మొదటిరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డిజిటల్ లిటరసీ, ఫైనాన్సిల్ లిటరసీ, ఫంక్షనల్ లిటరసీ, చిన్న చిన్న లెక్కలు, చిన్న చిన్న పదాలును అభ్యాసకులకు ఎలా నేర్పాలని అంశంపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ భవాని, ఎపిఎం శ్రీనివాస్, ఎంఇఒ, సిడిపిఒ, ఎంఎల్‌ఒ రాంబాబు పాల్గొని శిక్షణ ఇచ్చారు.

తెర్లాం: స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం ఉల్లాస్ కార్యక్రమం పై రెండు రోజుల శిక్షణ తరగతులను ఎంపిడిఒ ఆర్. రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వెళ్లడానికి డ్వాక్రా సంఘాల ద్వారా ప్రభుత్వం అనేక రకాల రాయితీలు అందిస్తుందని మహిళలకు వడ్డీ లేని రుణాలు అందిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ అక్షరాస్యత పొందాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో విఒఎలు, ఎంఇఒ, ఎపిఎం రాము, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చడమే ‘ఉల్లాస్’ ముఖ్య ఉద్దేశమని ఎంపిడిఒ కె.కిషోర్ కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపిడిఒ అధ్యక్షతన ‘ఉల్లాస్’ అక్షరాస్యతా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల స్థాయి కమిటీ ఆధ్వర్యంలో గ్రామ సంఘ సహాయకులు, వాలంటరీ టీచర్లు, వెలుగు సిసిలకు మొత్తం 213 మందికి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఎం.రమణమూర్తి, ఎపిఎం. జగదీశ్, ఎంఎల్‌ఒ ఏ. వైకుంఠరావు, వాసుదేవరావు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM
O.S. No. 73/ 2022

Between:
1.Smt. Kapu Gowri
2. Sri. Siddanathi Appala Nageswara Rao ....Plaintiffs
And:
Smt. Turpati Venkata Lakshmi & 2 others ....Defendants
To,
D-1: Smt. Turpati Venkata Lakshmi W/o. Late T.A.S.Karunakarudu, Hindu, aged 53 years, House Wife, R/o. D.No.4-21, B.C.Colony, Golzam Village, L.Kota Mandal, Vizianagaram District-535161
D-2: Turpati Sunitha D/o. Late T.A.S.Karunakarudu, Hindu, aged 32 years, -Rest Do-
D-3: Turpati Sai, S/o. Late T.A.S.Karunakarudu, Hindu, aged 28 years, -Rest Do-

NOTICE

Please take court notice/summons that the above suit is filed against the defendants 1 to 3 who succeeds the estate of the deceased Turpati Appala Sanyasi Karunakarudu, before the Hon'ble Addl Senior Civil Judge Court at Vizianagaram for recovery of money under pro-note dated **03-01-2021** for Rs. **36,00,000/- (Rupees Thirty Six Lakhs Only)** along with interest thereon. Due to non service of Court Sum- mons all of you i.e. defendants No.1 to 3, Thus, the Hon'ble Court pleased an order to serve the summons/notice under substituted service to the above stated Defendants 1 to 3. Therefore, hereby, informing you that the above matter is posted to **22-11-2024** for your appearance before the Honourable Senior Civil Judge at Vizianagaram at 10-30 A.M. If you fail to attend on that day, the matter will be heard and decided exparty.

(By Court Order)
J.V.V.JAGADEESWARA RAO
G.RAMANJINEYULU,
Advocates, Vizianagaram District.
Cell: 9246616118